అక్రమ నిర్మాణాల కూల్చివేత


నిర్మాణాలను కూల్చివేసిన రెవెన్యూ అధికారులు

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని మోహన్ నగర్ శృంగేరి కాలనీలోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను శనివారం రాత్రి రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. కాలనీలోని సర్వే నెంబర్–135లో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ శనివారం మేడ్చల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఉప్పల్ రెవెన్యూ అధికారులు సదరు నిర్మాణాలను కూల్చివేశారు. అధికారులు కూల్చి వెళ్లిపోయిన అనంతరం కబ్జాదారులు తాత్కాలిక రెండు గదుల రేకుల కంటెయినర్‌ను తీసుకువచ్చి ప్రభుత్వ స్థలంలో వేశారు. మరోసారి విషయం తెలుసుకున్న ఉప్పల్ మండల ఆర్ఐ, ఇతర రెవెన్యూ అధికారులు జేసీపీ సాయంతో అక్కడ వేసిన కంటెయినర్‌తో పాటు ఇతర నిర్మాణాలను పూర్తిగా నేలమట్టం చేశారు. ప్రభుత్వం స్థలాల్లో నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్ఐ అశ్విని చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సమస్యల పరిష్కారానికి వినతి


కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్: కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఇటీవల ఎన్నికైన శ్రీనివాసకాలనీ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం కార్పొరేటర్‌ను కలిసి కాలనీలోని పలు సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చిత్రింజన్, ఉపాధ్యక్షుడు సైదులు, అరుణ, ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, కోశాధికారి రామ్‌నాయక్, సంయుక్త కార్యదర్శి చరణ్‌సింగ్, సభ్యులు శేఖర్, అమర్నాథ్, రాంపుల్లారెడ్డి, రాంబాబు, వెంకటేశ్వర్లు, దేవయ్య, మురళీధర్ పాల్గొన్నారు.

విద్యార్థి యుద్ధభేరి మహాసభ విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మహేష్‌కుమార్

మలక్‌పేట: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 22న వరంగల్‌లో నిర్వహించనున్న విద్యార్థి యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కూరేళ్ల మహేష్‌కుమార్ కోరారు. మలక్‌పేటలోని అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మెస్‌చార్జీలను రూ. 4 వేల పెంపు, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. వరంగల్‌కు వేలాదిగా విద్యార్థులను తరలించడానికి తగిన ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.అనంతరం తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ గ్రేటర్ అధ్యక్షుడిగా మేడి నాగరాజును నియమించారు. ఉదయ్, భానుచందర్, ఉదయ్, శ్రవణ్‌కుమార్, విజయ్, రాకేష్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వేకు సహకరించాలి


వివరాలు నమోదు
చేయించుకుంటున్న కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన సర్వేకు అందరూ సహకరించాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ కోరారు. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధి వాణీనగర్ కాలనీలో ఆదివారం చేసిన సర్వేలో కోట్ల శ్రీనివాస్ తన కుటుంబ వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా ఉపాధి, ఆర్థిక వివరాలు సర్వేలో నమోదు చేయించడం ద్వారా ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరుతాయన్నారు. సర్వేలో తమ పూర్తి వివరాలు అందించడంపై ప్రజలు ఎలాంటి అపోహలకు గురి కావొద్దన్నారు.

శాకాహారంపై అవగాహన ర్యాలీ

వనస్థలిపురం: మైత్రేయ బుద్ధ పిరమిడ్ ధ్యాన శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం బీఎన్‌రెడ్డి నగర్‌లో ప్రపంచ శాంతి, మూగజీవుల పరిరక్షణ కోసం మహా కరుణ శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్ రావు, శ్రీనివాస్ యాదవ్, చంద్రకళ, శ్రీనివాస్, సువర్ణ పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యాన శిక్షకులు

పార్కుల అభివృద్ధికి కృషి

బోడుప్పల్: ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ లక్ష్మీనగర్ కాలనీలోని హుడాపార్కును ఆదివారం ఆయన సందర్శించారు. పార్కులో వాకర్స్, చిన్న పిల్లలతో ముచ్చటించారు. అనంతరం కాలనీవాసులతో పార్కు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్కుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, దశలవారీగా అన్ని పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. కొత్త కిశోర్‌గౌడ్, బొమ్మక్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు.. రంగుమారిన నీళ్లు



అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటిలో మురుగునీరు కలిసి సరఫరా అవుతోందని కుర్మగూడ బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 6 నెలల క్రితం ఎరుకల బస్తీ, కుర్మగూడ బస్తీలో కలుషిత నీటి సమస్య తలెత్తింది. స్థానికుల ఫిర్యాదుతో పలు మార్లు మరమ్మతు చేసినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో ఆయా బస్తీల్లో కొత్తపైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఆరు నెలల క్రితం కొంత మేరకు పైపులు వేసి వదిలేశారు. ఈ విషయమై మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ అధికారులతో ఆరా తీయగా పైపుల కొరత ఉండటంతో పనులు పూర్తి చేయలేదని చెప్పడం విడ్డూరం.
– చంచల్‌గూడ


శారదానగర్‌లో ఇళ్ల మధ్య నుంచి డ్రైనేజీ వ్యవస్థ కోసం అడ్డగోలుగా తవ్విన రోడ్డు

ప్రణాళిక లేని పనులు..

ప్రజలకు తిప్పలు!

అభివృద్ధి పనుల్లో ప్రణాళికలు పాటించకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎగువన ఉన్న కాలనీల నుంచి తమ కాలనీ మీదుగా ఉన్న వరద కాలువ, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలతో ఇప్పటికే తమ కాలనీ ముంపునకు గురవుతోందని, కొత్తగా ఎగువన ఉన్న గడ్డిపొలాల వారు వెంచర్లు చేస్తుండడంతో వారికి అనుకూలంగా జలమండలి అధికారులు కాలనీ నుంచి మరో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు అడ్డగోలు తవ్వకాలు చేస్తుండడంతో మరిన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని శారదానగర్ ఫేజ్–3 కాలనీవాసులు వాపోతున్నారు.
– వనస్థలిపురం

హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదానగర్ ఫేజ్–3 ప్రతి వర్షాకాలం ముంపుబారిన పడుతోంది. ఎగువ కాలనీల నుంచి వచ్చే వరద, మురుగునీరు ఆ కాలనీ నుంచే దిగువకు వెళ్లేలా ఓపెన్ నాలా, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలు ఉన్నాయి. కాగా ఎగువన ఉన్న గడ్డిపొలాల వారు తమ పొలాల్లో వెంచర్లు చేస్తున్న నేపథ్యంలో గతంలో పొలాల మధ్య నుంచి శారదానగర్ మీదుగా ఉన్న ఓపెన్ నాలాను మూసివేసి, వారి నిర్మాణాలకు అడ్డురాకుండా వారికి అనుకూలంగా శారదానగర్ కాలనీ నుంచి జిగ్‌జాగ్‌గా మరో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వారికి అంగ, ఆర్థిక బలం ఉండడంతో వారు అడిగిందే తడవుగా జలమండలి అధికారులు శారదానగర్ కాలనీ మీదుగా ఎన్నో మలుపులు తిప్పుతు కొత్త డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు పనులు చేపట్టారు.



రూ.40 లక్షలతో..

కాలనీవాసులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇళ్లముందు పైపులైన్ కోసం అడ్డగోలు తవ్వకాలు చేయడంతో కాలనీలోని రోడ్డు నెం.10, 11లో ఆ ప్రాంతాల వారు తమ ఇళ్లల్లోకి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఉన్న పాత డ్రైనేజీ కాలువను ఉపయోగించకుండా కొత్తగా దాదాపు రూ.40 లక్షలు వెచ్చించి కొత్త డ్రైనేజీ నిర్మించడం ఎందుకని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఫిర్యాదు చేసినా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రీ మోడలింగ్ చేస్తున్నాం..

కాలనీవాసులకు సమాచారం లేకుండా డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపడుతున్నామనేది అవాస్తమని జలమండలి డీజీఎం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో కాలనీవాసులు అడ్డుకోగా ఎమ్మెల్యే, కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో చర్చించిన తర్వాతే రీమోడలింగ్ పనులు చేపట్టాం. గతంలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ ఎగుడుదిగుడుగా ఉండడంతో కొత్తగా పెద్ద పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ప్రశాంతంగా గ్రూప్–3 పరీక్షలు

లింగోజిగూడ: హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం గ్రూప్–3 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 14 సెంటర్లలో జరిగిన పరీక్షలో 5832 మందికి 3375 మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



చైతన్యపురి: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం రాత్రి చైతన్యపురి మెట్రో స్టేషన్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సదరు వ్యక్తికి 45 సంవత్సరాలు ఉంటాయని కుడి చేతిపై అమ్మ అనే ట్యాటు ఉందని పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు నైతిక బాధ్యత ఉండాలి

బోడుప్పల్: విద్యార్థులు గురువుల పట్ల విధేయులై నైతిక విలువలు కలిగి ఉండాలని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాశ్‌నారాయణ అన్నారు. బోడుప్పల్ పల్లవి మోడల్ స్కూల్ 11వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యావిధానంలో తల్లిదండ్రుల్లో మార్పురావాలని, బట్టీ పట్టడం, కాపీ కొట్టడం వల్ల వచ్చే మార్కుల కంటే విషయంపై అవగాహన వల్ల వచ్చే మార్కులకు విలువ ఎక్కువగా ఉంటుందన్నారు. విద్యార్థులందరూ ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలన్నారు. చిన్నారులు ప్రదర్శించిన యోగ, కురుక్షేత్ర సంగ్రామం ఘట్టాలు, వివిధ దేశాల వేషధారణ, సంస్కృతులను వ్యక్తపరిచే నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. చైర్మన్ కొమురయ్య, డైరెక్టర్ సుశీల్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సుధ, ప్రిన్సిపాల్ తనూజ పాల్గొన్నారు.


జయప్రకాశ్‌నారాయణకు జ్ఞాపికను అందజేస్తున్న సుశీల్‌కుమార్

నడకతో ఆరోగ్యం పదిలం



వాక్‌లో పాల్గొన్న కాలనీవాసులు

దిల్‌సుఖ్‌నగర్: ఆరోగ్య సంరక్షణకు నడక ఎంతో ఉపయోగపడుతుందని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, వాసవికాలనీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గౌరిశెట్టి అరుణ్ కుమార్ అన్నారు. వాకింగ్ ప్రాధాన్యతను తెలిపి ఆరోగ్యాన్ని పెంపొందించుకునే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి వాసవి కాలనీ ఆర్యవైశ్య సంఘం, వాసవికాలనీ ఆధ్వర్యంలో నిర్వహించిన 4కె వాక్‌లో కాలనీవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్‌కేపురం అష్టలక్ష్మి దేవాలయం నుంచి ఎల్‌బీనగర్ మీదుగా వాసవికాలనీలోని ఆధ్యాత్మిక కేంద్రం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ తమ్మన శ్రీధర్, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, మధుర, ఉపేందర్ రెడ్డి, ప్రాజెక్ట్ చైర్మన్ తమ్మన లక్ష్మీ సుజాత, ఓరుగంటి లక్ష్మీ, పూసర్ల లక్ష్మి, శ్రీకాంత్, శివకుమార్, దాచేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ


పూజల్లో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి


అభిషేకం చేస్తున్న ప్రదీప్‌కుమార్ దంపతులు

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని హస్తినాపురం డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్‌లోని హరిహర క్షేత్ర అయ్యప్ప దేవాలయంలో దేవాలయం కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప పూజలు ఘనంగా నిర్వహించారు. హంపి విరూపాక్ష విద్యారణ్య భారతిమహాస్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమణగురుస్వామి, మల్లికార్జున్ గుప్తా పాల్గొన్నారు.

రెయిన్‌బో నందనవనంలో..

రెయిన్‌బో నందనవనంలో దుర్గాప్రసాద్, అరిగె శ్రీను, నరేందర్‌రెడ్డి గురుస్వాముల ఆధ్వర్యంలో హైకోర్టు అడ్వకేట్ ప్రదీప్‌కుమార్ నిర్వహించిన అయ్యప్ప పూజకు భక్తులు పోటెత్తారు. సూర్యాపేట భజన బృందం ఆలపించిన భక్తిగీతాల నడుమ మనికంఠుడి పల్లకీ సేవ వైభవంగా కొనసాగింది. పూజల్లో నందనవనం ప్రెసిడెంట్ భాస్కర్ గౌడ్, సీహెచ్.సురేశ్, మల్లికార్జున్, ఎన్.శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, చంద్రమౌళి, ఎస్.రామకృష్ణ, రిషి యాదవ్ పాల్గొన్నారు.

ఇదేం చెత్త పని..

చాదర్‌ఘాట్: నగర సుందరీకరణలో భాగంగా ఓల్డ్‌మలక్‌పేటలో పురాతన గోడలకు ప్రకృతి అందాలు మైమరిపించేలా బొమ్మలను తీర్చి దిద్దుతున్నారు. అయితే.. అందంగా తీర్చిదిద్దిన గోడల వద్దే కొందరు చెత్త పారబోస్తుండటంతో అపరిశుభ్రంగా కనిపిస్తుండటంతో పాటు దుర్గంధం వస్తుందని అటుగా రాకపోకలు సాగించేవారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెత్తను తరలించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి అంజిరెడ్డినగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

ఉదయం గం. 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు

అంజిరెడ్డినగర్, ప్రెస్‌కాలనీ, పవన్‌పురి, విష్ణునగర్, ఎంఆర్‌ఆర్, పద్మానగర్ కాలనీలు.

మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు

పద్మానగర్ ఫీడర్ పరిధిలో పద్మానగర్, రాఘవేంద్ర, క్రాంతినగర్, శిఖరాఎన్‌క్లేవ్, కర్మన్‌ఘాట్ పాతబస్తీ, జ్యోతినగర్, భానునగర్, నిర్మలానగర్, శ్రీనిధి కాలనీల్లో విద్యుత్ ఉండదన్నారు.

ఆస్మాన్‌గఢ్ డివిజన్ పరిధిలో..

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌గఢ్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

అజంతా కాలనీ, ప్రిన్స్ బాడీగార్డ్ లేన్, రేస్‌కోర్స్ రోడ్, పీస్‌కాలనీ, కరణ్‌బాగ్, జీఏ పార్క్, జీఏ కాలనీ, నియోరాయల్ స్కూల్, శ్రీనివా కమ్యూనిటీ హాల్, రామాలయం, పద్మావతి కల్యాణమండపం, ఇంద్రప్రస్థ కాలనీ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, పద్మావతి కాలేజ్, సంగం లక్ష్మీబాయి కాలేజ్.

మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు...

ఎంసీహెచ్ కాలనీ, రేస్‌కోర్స్ రోడ్, లైబ్రరీ పీటీ, వాణి స్కూల్, శంకేశ్వరబజార్, సరస్వతీ నగర్, కోదండరాం నగర్, సాహితి నగర్, సన్‌షైన్ కాలనీ, పూర్ణోదయా కాలనీ, పూర్ణోదయా కాలనీ పార్క్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

ఉత్సాహంగా క్రీడా దినోత్సవం


వేడుకలను ప్రారంభిస్తున్న సునీత

వనస్థలిపురం: వనస్థలిపురం హిల్‌కాలనీలోని బచ్‌పన్ పాఠశాలలో క్రీడా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, రీజినల్ అకాడమిక్ కోఆర్డినేటర్ సునీత, ప్రిన్సిపాల్ ఎస్.కల్పవల్లి జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. పిల్లల మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో.. ఆటలు కూడా అంతే ముఖ్యమన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి సర్టిఫికెట్లు, మెడల్స్ బహూకరించారు.

మంత్రి సహకారంతో రోడ్డు నిర్మాణం


రోడ్డును పరిశీలిస్తున్న కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌లో రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో రూ. 24 లక్షల నిధులతో కొత్తగా సీసీ రోడ్డును నిర్మించుకోవడం జరిగిందని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. సీసీ రోడ్డు మంజూరు చేయించడానికి కృషి చేసిన పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుట్ల నరసింహా యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అధ్యక్షుడు నరసింహా యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు యాదగిరి రావు, అంజయ్య, చంద్రమోహన్, కృష్ణారెడ్డి, లాల్‌సింగ్, లింగయ్య యాదవ్, గణేష్ పాల్గొన్నారు.

బెస్ట్ టీచర్ అవార్డు ప్రదానం


అవార్డుఅందుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

నాగోలు: నగరంలోని బిర్లా ప్లానిటోరియంలో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కమలా మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జైపురికాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్‌రెడ్డికి బెస్ట్ టీచర్ అవార్డును అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యా అందేలా కృషి చేస్తున్నందుకు శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రాష్ట్ర మాజీ సైన్స్ అధికారి ప్రభాకర్ రావు, డా.మునీష్ జిందాల్, డా. జ్యోష్నా రావు పాల్గొన్నారు.

రూ.63 లక్షలతో అభివృద్ధి పనులు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ గీత

ఉప్పల్: నియోజకవర్గ పరిధిలో అన్ని డివిజన్లలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ సర్కిల్ పరిధి చిలుకానగర్ డివిజన్‌లోని బీరప్పగడ్డ, ఈస్ట్ కల్యాణపురి కాలనీల్లో సీసీరోడ్లకు రూ.63 లక్షలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులుకు స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీసీరోడ్లతో పాటు సివరేజ్ లైన్లను కూడా ఆధునీకరిస్తున్నట్లు వివరించారు. ఈస్ట్ కల్యాణపురికాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్, బాలకృష్ణగౌడ్ కొండల్‌రెడ్డి, బాలు, శ్యామ్, అశోక్‌చారి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవం

బోడుప్పల్: వాసవీనగర్ కాలనీ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్.మోహన్‌బాబు, ఉపాధ్యక్షులుగా కిశోర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా క్రాంతికుమార్, కోశాధికారిగా సాయిగణేష్, కల్చరల్, ఆర్గనైజింగ్ మెంబర్స్‌గా సందీప్‌శర్మ, సంతోష్, లీగల్, మీడియా సలహాదారులుగా మల్లేష్, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. మోహన్‌బాబు, క్రాంతికుమార్ మాట్లాడుతూ.. మాజీ అధ్యక్షులు, కాలనీ పెద్దల సలహాలను తీసుకుంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.